సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 14 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8.500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.47
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.47, కనిష్టంగా రూ.34 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
28.2°/ 20.6°

జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వీడని జడివాన

- జిల్లాలోని 30 మండలాల్లో వర్షం



కొత్తచెరువు మండలం లోచర్ల వద్ద కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్‌: తుపాను ప్రభావంతో రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా జడివాన పట్టుకుంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ 30 మండలాల పరిధిలో 194 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుడిబండ మండలంలో 19.6 మి.మీ, హిందూపురం మండలంలో 17.2 మి.మీ, గోరంట్ల మండలంలో 16.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక చిలమత్తూరు మండలంలో 12.6 మి.మీ, రొళ్ల 11.4, మడకశిర 10.4, అమడగూరు 9.8, అమరాపురం 8.6, నల్లచెరువు 7.4, తనకల్లు 6.4, అగళి 6.2, పరిగి 6.2, ఓడీచెరువు 6.2, సోమందేపల్లి 5.4, రామగిరి 5.2, పెనుకొండ 5.2, కదిరి 4.2, గాండ్లపెంట 4, కొత్తచెరువు 3.6, రొద్దం 3.4, తలుపుల 3.2. నల్లమాడ 3.2, పుట్టపర్తి 3.2, ధర్మవరం 2.6, బుక్కపట్నం 2.4, సీకేపల్లి 2.4, లేపాక్షి 2.4, ముదిగుబ్బ 2.2, ఎన్పీకుంట 2.0, బత్తలపల్లి మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి (2026–27 విద్యా సంవత్సరం) దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి కలిగిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన విద్యార్థులు ఈనెల 27వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖాద్రీశుడికి భక్త 'కోటి' కానుక

- శ్రీవారికి హుండీ ద్వారా రూ.1.13 కోట్ల ఆదాయం



హుండీలను లెక్కిస్తున్న ఆలయ, బ్యాంకు సిబ్బంది

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్త కోటి హుండీల ద్వారా సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. మొత్తంగా 75 రోజులకు గాను రూ.1,13,14,265తో పాటు 14 గ్రాముల బంగారం, 810 గ్రాముల వెండిని భక్తులు హుండీ ద్వారా స్వామికి సమర్పించినట్లు ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇవికాకుండా పలు దేశాల కరెన్సీ కూడా భక్తులు స్వామికి సమర్పించారన్నారు. ఈసారి ఆలయ హుండీ ఆదాయం పెరిగినట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి ఎన్‌.ప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్, బ్యాంక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి



పుట్టపర్తి: విద్యాహక్కు చట్టం 12(1)సి ప్రకారం పేదలు, బలహీన వర్గాల కుటుంబాల్లోని పిల్లలకు ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు (2025–26 విద్యా సంవత్సరానికి) సీట్లు కేటాయిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా అధికారి దేవరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గాలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతర కులాల్లోని బలహీన వర్గాలకు 4 శాతం, హెచ్‌ఐవీ, అనాథ, దివ్యాంగుల కేటగిరీ వారికి 5 శాతం సీట్లు కేటాయించామన్నారు. బీసీ, మైనార్టీ, ఓసీల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షల్లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల్లోపు ఉండాలన్నారు. అర్హులు ఈ నెల 20వ తేదీ వరకూ http://cse.ap.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అర్హతను పరిశీలించి ఈ నెల 21న తుది జాబితా తయారు చేస్తామన్నారు. ఈ నెల 25న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దారి తప్పిన పోలీసు

- పెనుకొండ సబ్ డివిజన్‌లో రక్షణ కల్పించాలని ఓ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళపై ఇన్‌స్పెక్టర్ వేధింపులకు దిగాడు. 'ఒంటరిగా ఎన్నాళ్లు ఉంటావ్.. తోడు కోరుకోవా?' అంటూ దిగజారి ప్రవర్తించాడు. బాధితురాలు నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయడంతో విచారణ చేయించిన పోలీసు ఉన్నతాధికారులు సదరు ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేశారు.
- ధర్మవరం సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం ఓ మహిళ వెళ్లగా..ఫోన్ నంబరు తీసుకున్న ఎస్‌ఐ.. రాత్రి వేళల్లో ఆమెకు ఫోన్ చేసి వేధించసాగాడు. "నీకు న్యాయం జరగాలంటే.. నా కోరిక తీర్చాలి" అని నీచంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా.. పదే పదే వీడియో కాల్స్ చేస్తూ ఇబ్బందులకు గురి చేశాడు. మీడియాలో వార్తలు రావడంతో సదరు ఎస్‌ఐపై వేటు పడింది.
- పుట్టపర్తి సబ్ డివిజన్‌లో పనిచేసే ఓ ఎస్‌ఐ.. ఓ మహిళతో ఆస్తి కొనుగోలు చేశాడు. అందుకు డబ్బు ఇవ్వకుండా వేధించాడు. ఇద్దరి మధ్య పదే పదే ఫోన్ కాల్స్ నడిచాయి. ఈ క్రమంలో సదరు ఎస్‌ఐ తనను లైంగికంగా వేధిస్తున్నాడని బాధిత మహిళ ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. విచారణ అనంతరం ఆ ఎస్‌ఐని జిల్లా దాటించేశారు.



- ఖాకీ వనంలో కామాంధులు
- న్యాయం కోరిన మహిళలకు వేధింపులు
- వెలుగులోకి పోలీసు అధికారుల బాగోతాలు
- ఆర్నెల్లలో ముగ్గురు అధికారులపై వేటు
- బాధితులు ఫిర్యాదు చేసేంతవరకూ పట్టించుకోని ఉన్నతాధికారులు
- పోలీసుల వ్యవహార శైలిని తప్పుపడుతున్న జనం

సాక్షి, పుట్టపర్తి

ఎవరికైనా అన్యాయం జరిగితే నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి న్యాయం చేయాలని కోరుతుంటారు. ఇక మహిళల రక్షణ విషయంలో చాలా మంది పోలీసులు బాధితురాలిని తమ తోబుట్టువుగా భావించి వారికి అండగా నిలిచిన ఎన్నో సంఘటనలు చూశాం. అందుకే సమాజంలో ఖాకీ చొక్కాకు ఇంకా గౌరవం మిగిలి ఉంది. కానీ ఇటీవల కొందరు ఖాకీలు దారి తప్పారు. రక్షణ కోసం పోలీసు స్టేషన్ మెట్లెక్కే మహిళల పట్ల దారుణంగా ప్రవర్తిస్తున్నారు. 'మీకు న్యాయం చేస్తాం...మాకేంటి' అంటూ బేరం పెడుతున్నారు. రాత్రి వేళల్లో ఫోన్ కాల్స్.. నగ్నంగా వీడియో కాల్స్ చేస్తూ సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో బాధిత మహిళల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతుండగా...పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోంది.

> 'కోరిక తీరిస్తే కానీ సమస్య తీరదు..
> లేదంటే ఇబ్బందులు పడక తప్పదు..
> ఎన్నాళ్లిలా ఒంటరిగా ఉంటావ్.. తోడు వద్దా?
> ఏం చేస్తున్నావ్..? ఇంట్లో ఎవరూ లేరా? బయటికి ఎన్ని గంటలకు వస్తున్నావ్?"
> ...న్యాయం కోసం వచ్చిన మహిళలతో కొందరు పోలీసుల దిగజారుడు సంభాషణ ఇది...

'ఫ్యామిలీ' వ్యవహారాల్లో తలదూరుస్తూ..

గత వైఎస్సార్ సీపీ సర్కార్ మహిళల రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. ప్రత్యేక చట్టాలతో పాటు మహిళల కోసమే 'దిశ' స్టేషన్లు ఏర్పాటు చేసింది. అలాగే ప్రతి పోలీసు స్టేషన్‌లోనూ మహిళా కానిస్టేబుల్ ఉండేలా రిసెప్షన్ ఏర్పాటు చేసింది. ఫలితంగా ఎవరైనా మహిళలు పోలీసు స్టేషన్‌కు వెళితే రిసెప్షన్‌లో ఉన్న మహిళా కానిస్టేబుళ్లు వివరాలన్నీ తెలుసుకుని దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చేవారు. లేదంటే దిశ స్టేషన్‌కు పంపి అక్కడ కౌన్సెలింగ్ ఇప్పించి దంపతులను కలిపి పంపేవారు. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. 'ఫ్యామిలీ' విషయాల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు హద్దుదాటి పోతున్నారు. బాధితులను పదేపదే పిలిపించడం... లేదా ఫోన్లలో సంభాషిస్తూ లైంగిక వేధింపులకు దిగుతున్నారు. దీంతో ఒంటరిగా మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

ఆర్నెల్లలో ముగ్గురిపై వేటు..

జిల్లా పరిధిలో గడిచిన ఆర్నెల్ల వ్యవధిలో ముగ్గురు పోలీసు అధికారులపై వేటు పడింది. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన తీరుపై విచారణ చేయించి.. నిర్ధారణ అయిన తర్వాత స్థానచలనం కల్పించారు. ఒక ఘటన మరిచే లోపు మరొకరి బాగోతం బయటికి వస్తోంది. పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం సబ్ డివిజన్‌లలో ఒక్కో పోలీసు అధికారిపై ఇప్పటికే వేటు పడింది.

లోపించిన పర్యవేక్షణ..

జిల్లా వ్యాప్తంగా పోలీసు వ్యవస్థలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహారాలు చూసే 'అడ్మిన్' (అదనపు ఎస్పీ) పోస్టు ఖాళీగా ఉంది. ఆ తర్వాత స్థాయిలో డీఎస్పీలు ఉంటారు. సబ్ డివిజన్ పరిధిలో ఏ కేసులు వస్తున్నాయనే విషయంలో నిఘా లేకపోవడంతో ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లే నెలల తరబడి కొందరు మహిళలు వేధింపులకు గురై చివర్లో నేరుగా ఎస్పీ కార్యాలయానికి వెళ్తున్నారు. ఆ తర్వాత విచారణ జరిపి చర్యలు తీసుకుంటున్నా... పోలీసుశాఖకు మాత్రం చెడ్డపేరు వస్తోంది.

లోపించిన శాంతి భద్రతలు..

కొందరు పోలీసులు తమ పని మరచి.. రాసలీలల్లో మునిగి తేలుతుండగా.. దొంగలు, తమ పనికానిస్తున్నారు. ఇటీవల పలు ప్రాంతాల్లో జరుగుతున్న వరుస చోరీలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సామూహిక అత్యాచారాలు.. బ్యాంకుల దోపిడీ.. రౌడీ షీటర్ల ఆగడాలు..ఇలా శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి.

దీన్నేమైనా రోడ్డు అంటారా?

- అధికారులపై జడ్జి కె.శివశంకర్ అసంతృప్తి

అమరాపురం: 'దీన్నేమైనా రోడ్డు అంటారా.. అసలు ప్రజలు దీనిపై ఎలా ప్రయాణిస్తున్నారో కూడా అర్థం కావడం లేదు' అని అనంతపురం సీనియర్ సివిల్ స్పెషల్ జడ్జి డాక్టర్ కె.శివశంకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే.. జడ్జి డాక్టర్ కె.శివశంకర్ స్వగ్రామం తమ్మడేపల్లి. బుధవారం ఆయన అమరాపురం నుంచి తమ్మడేపల్లికి కారులో బయలుదేరారు. మార్గమధ్యలో ఆయన కారు గుంతలో ఇరుక్కుంది. దీంతో జడ్జి శివశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరాపురం నుంచి కళ్యాణదుర్గం మీదుగా నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయని, అలాగే వివిధ గ్రామాల ప్రజలు నిత్యం అమరాపురానికి వచ్చిపోతుంటారన్నారు. ఇలాంటి గతుకుల రోడ్డులో ప్రజలు ఏవిధంగా ప్రయాణం చేస్తారో అర్థం కావడం లేదన్నారు. మండల కేంద్రమైన అమరాపురం నుంచి విరుపసముద్రం బార్డర్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును వెంటనే బాగు చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్‌చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం: కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రమణ ప్రసాద్ పేర్కొన్నారు. తిరుపతిలోని 'స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రిసియన్'లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఎస్సీ (హెచ్‌ఏ అండ్ హెచ్‌ఏ) మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్‌లో 40 శాతం పైబడి మార్కులు సాధించిన వారు అర్హులు. క్రాఫ్ట్ కోర్సు ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ కోర్సు, సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ (సీసీఎఫ్‌బీఎస్) కోర్సుకు పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి. కోర్సులు పూర్తయిన తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 97013 43846, 91005 58006, 97004 40604లో సంప్రదించవచ్చు.

మద్యంలో మునిగితేలుతున్నారు!



బ్రహ్మసముద్రం మండలంలోని గ్రామాలకు ప్రత్యేక వాహనంలో మద్యం సరఫరా చేస్తున్న దృశ్యం



బ్రహ్మసముద్రంలో ఓ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బెల్టుషాపు

- నెలనెలా పెరుగుతూనే ఉన్న వినియోగం
- పల్లె పల్లెనా విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటు
- 11 మాసాల్లో రూ.1,550 కోట్ల విలువైన లిక్కర్ అమ్మకాలు
- 1.98 కోట్ల లీటర్ల మద్యం సేవనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. ఊరూరా వెలసిన బెల్టుషాపులు మద్యాన్ని ఇంటింటికీ సరఫరా చేసే స్థాయికి చేరాయి. నగరంలో వైన్‌షాపులు సమయం ప్రకారమే నడుచుకోవాలి. కానీ బెల్టుషాపులకు సమయమూ సందర్భమూ ఏమీ లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు అందిస్తారు. పల్లెల్లో ప్రస్తుతం ఏదైనా బాగా అందుబాటులో ఉందీ అంటే అది మద్యమేననే విమర్శలు వినిపిస్తున్నాయి.

కూరగాయల షాపుల కంటే ఎక్కువ

సాధారణంగా ఊరికి రెండు, మూడు కూరగాయల షాపులు.. మండల కేంద్రాల్లో అయితే పదిహేను, ఇరవై వరకూ అందుబాటులో ఉంటాయి. కానీ రాప్తాడు నియోజకవర్గంలోని 1,500 జనాభా ఉండే బండమీదపల్లెలో 15 నుంచి 20 వరకూ బెల్టుషాపులున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పాల వ్యాన్‌లు ఎలా అయితే షాపులకు పాలు వేస్తూ వెళతాయో అదే తరహాలో బెల్టుషాపులకు మందు సరఫరా చేయడానికి వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లో ఏ ఊరికెళ్లినా పట్టపగలే రోడ్డుమీద మద్యం పెట్టి అమ్ముతున్న దృశ్యాలు కనిపిస్తాయి.

రూ.1,550 కోట్ల వినియోగం..

2024 సెప్టెంబర్ 15న కొత్త మద్యం పాలసీ వచ్చింది. అప్పటినుంచి ఈరోజు వరకూ అంటే 11 నెలల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూ.1,550 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయిందంటే ఎలా తాగుతున్నారో అంచనా వేయొచ్చు. ఈ 11 నెలల్లో 1.97 కోట్ల లీటర్ల మద్యం సేవించారు. బీర్ల సేవనం దీనికి అదనం. పట్టణాల్లో అయితే పర్మిట్ రూముల్లో మందుబాబులు మద్యంలో మునిగి తేలుతున్నారు.

మామూళ్లు మద్దయ్యకు తెలిసే..

మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ఇందుకు నెలనెలా ఎక్సైజ్ అధికారులకు మామూళ్లు వెళుతున్న విషయం తెలిసిందే. ఇదంతా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) నాగమద్దయ్యకు తెలిసే జరుగుతోందని ఒక ఎక్సైజ్ అధికారి చెప్పారు. 'మామూళ్ల సంగతి కిందిస్థాయి కానిస్టేబుల్‌కే తెలిసినప్పుడు డీసీకి తెలియకుండా ఉంటుందా?' అనే చర్చ జరుగుతోంది. దీనిపై డీసీని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం అమ్మకాలు ఇలా

అనంతపురం జిల్లాలో మద్యం వినియోగం
1,21,48,578 (లీటర్లు)

ఈ మద్యం వినియోగం విలువ
రూ.962,16,68,299

శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం వినియోగం
76,41,828 లీటర్లు

ఈ మద్యం వినియోగం విలువ
రూ.587,06,37,344

రెండు జిల్లాల్లో మద్యం వినియోగం
1,97,90,406 లీటర్లు

ఈ మొత్తం మద్యం వినియోగం విలువ
రూ.1549,23,05,643

(బీరు వినియోగం, విలువ దీనికి అదనం)

ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా



ఎంపీపీ ఎన్నికలో పాల్గొన్న ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు



ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న సంజీవయ్య

- రామగిరి ఎంపీపీ ఎన్నికకు ముగ్గురు ఎంపీటీసీలే హాజరు
- టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీల గైర్హాజరు
- వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన అధికారి

రామగిరి: రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన రామగిరి ఎంపీపీ ఎన్నిక మరోసారి నిరవధికంగా వాయిదా పడింది. ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన రామగిరి ఎంపీపీ ఎన్నిక కోసం అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అయితే 10 మంది ఎంపీటీసీలకు గాను కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. వారు కూడా పురుషులు కావడం...ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు అయిన నేపథ్యంలో ఎన్నికల అధికారి సంజీవయ్య రామగిరి ఎంపీపీ ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మళ్లీ ఎన్నిక ఎప్పుడు నిర్వహించేది రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేస్తుందన్నారు.

ఒక్కసీటుతో పీఠం కోసం టీడీపీ పాకులాట..

రామగిరి మండలంలో పది ఎంపీటీసీ స్థానాలుండగా అందులో పేరూరు–1, పేరూరు–2, మాదాపురం, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రిలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందారు. నసనకోట స్థానాన్ని మాత్రం టీడీపీ దక్కించుకోగలిగింది. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వు కాగా, రామగిరి ఎంపీటీసీ సభ్యురాలు మీనుగ నాగమ్మను ఆ పార్టీ అధిష్టానం ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టింది. అయితే గత డిసెంబరులో మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా... ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది.

నాలుగోసారి వాయిదా..

రాష్ట్ర ఎన్నికల సంఘం రామగిరి ఎంపీపీ ఎన్నికకు మార్చి 27న నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ రోజు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో ఎన్నిక వాయిదా పడింది. మే 18న రెండోసారి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వగా, మహిళా సభ్యులు హాజరుకాకపోవడంతో రెండోసారి వాయిదా పడింది. జూలై 16న మూడోసారి ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేయగా.. టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిరసనగా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎన్నికను బహిష్కరించడంతో మరోసారి వాయిదా పడింది. తాజాగా బుధవారం ఎన్నిక సజావుగా జరుగుతుందనే నమ్మకం లేనందున వైఎస్సార్ సీపీ సభ్యులు రాలేకపోయినట్లు సమాచారం. దీంతో నాల్గోసారి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది.

టీచర్లకు మోత... నేతలకు మేత

- సంస్కరణల పేరిట మూల్యాంకన పుస్తకాల పంపిణీ
- బడిలోనే పేపర్లు దిద్దాల్సి రావడంతో బోధనపై ప్రభావం
- కూటమి సర్కార్ అనాలోచిత నిర్ణయంపై ఉపాధ్యాయుల ఆగ్రహం

కదిరి: సంస్కరణల పేరిట కూటమి ప్రభుత్వం విద్యారంగంలో తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఫలితంగా విద్యా ప్రమాణాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఇప్పటికే బోధనేతర పనులతో టీచర్లు సతమతమవుతుంటే తాజాగా ప్రభుత్వం సరఫరా చేసిన పరీక్షల అసెస్మెంట్ పుస్తకాలు గురువులకు కోపం తెప్పిస్తున్నాయి. సంస్కరణల మాట దేవుడెరుగు..కొందరు కూటమి నేతల జేబులు నింపడానికే ఈ పుస్తకాలను సరఫరా చేసినట్లు కనబడుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. వీటి ద్వారా టీచర్లపై మూల్యాంకన భారం పడటంతో పాటు విద్యార్థులకు సైతం తీరని నష్టం జరుగుతుందని వారంటున్నారు.

పరీక్ష కోసం ఒక్కో సబ్జెక్టుకు ఒక పుస్తకం..

జూన్, జూలై మాసాల సిలబస్‌పై విద్యార్థుల అభ్యసన మదింపు కోసం ఈనెల 11 నుంచి ప్రారంభమైన ఫార్మేటివ్ అసెస్మెంట్(ఎఫ్‌ఏ–1) పరీక్షలు బుధవారం నాటికి 1–7 తరగతుల విద్యార్థులకు ముగిశాయి. 8, 9, 10 తరగతులకు గురువారం ఉదయం జరిగే బయాలజీ పరీక్షతో ముగుస్తాయి. గతంలో పిల్లలు తెల్లకాగితాల్లో పరీక్షలు రాస్తే... వాటిని టీచర్లు ఇంటికెళ్లి మూల్యాంకనం చేసేవారు. ఈ క్రమంలో బడిలో పిల్లల బోధనకు ఆటంకం కలిగేది కాదు. తాజాగా కూటమి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి సబ్జెక్టుకు ఒకటి చొప్పున... ఎన్ని సబ్జెక్టులంటే అన్ని మూల్యాంకన పుస్తకాలను పంపిణీ చేసింది. ఇప్పటి నుంచి ఈ పుస్తకాల్లోనే ఏడాది మొత్తం అన్ని పరీక్షలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,696 ఉండగా.. ఆయా పాఠశాలల్లో 1,42,327 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇంతమంది విద్యార్థులకు సబ్జెక్టుకు ఒకటి చొప్పున పుస్తకాలను ఇవ్వాలంటే రూ.కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇదో పెద్ద స్కాం..అని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. వీటి వల్ల పిల్లలకు నష్టమే గానీ ఎలాంటి ప్రయోజనం లేదంటున్నారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన మూల్యాంకన పుస్తకాలు

ఇంటికి మోసుకెళ్లడం సాధ్యమా..?

గతంలో సమాధాన పత్రాలను ఆయా సబ్జెక్టు టీచర్లు ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసి మార్కులు వేసి తిరిగి పాఠశాలకు తీసుకు వచ్చేవారు. కొందరు టీచర్లు వెసులుబాటును బట్టి బడిలోనే దిద్దేవారు. ఇప్పుడు మూల్యాంకన పుస్తకాలన్నింటినీ ఉపాధ్యాయులు ఇంటికి మోసుకెళ్లి వాటిని దిద్ది మళ్లీ పాఠశాలకు మోసుకురావడం సాధ్యమా..? అని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. తరగతి గదిలోనే వాటిని దిద్దాలంటే బోధనకు సమయం ఎక్కడ సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు.

కాపీ కొట్టేందుకు అవకాశం..

ఎఫ్‌ఏ–1, ఎఫ్‌ఏ–2 పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలు కొన్ని క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీలో నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల్లో కూడా పునరావృతమవుతాయి. అప్పుడు విద్యార్థులు ఈ మూల్యాంకన పుస్తకాల్లో గతంలో రాసిన సమాధానాలను చూసి కాపీ కొట్టేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా విద్యార్థులకు నష్టమే తప్ప లాభం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులపైనే కాకుండా టీచర్లపై కూడా ఇలాంటి నిర్ణయాలను బలవంతంగా రుద్దడం సరి కాదని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్త కంఠంతో చెబుతున్నాయి.

టీచర్లకు భారమే



మూల్యాంకన పుస్తకాలు పిల్లలకే కాదు..టీచర్లకు కూడా భారమే. అన్ని పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లడం కుదరదు..అలాగని తరగతి గదిలో కూర్చొని వాటిని దిద్దడం కుదరదు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమే.
– బడా హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ 1938

బోధన సమయం వృథా



మూల్యాంకనం పుస్తకాలు బడిలోనే దిద్దాలంటే బోధన సమయం వృథా అవుతుంది. సంస్కరణలు విద్యార్థులకు మేలు చేయాలి గానీ ఇలా కీడు చేస్తే విద్యావ్యవస్థ నాశనమే.
– కాడిశెట్టి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్

క్లుప్తంగా

ప్రమాదంలో పాస్టర్ మృతి


దేవదాస్ (ఫైల్)

ఓడీచెరువు (అమడగూరు): వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ చర్చి ఫాదర్ మృతి చెందారు. వివరాలు.. ఓడీచెరువులోని చర్చి ఫాదర్ దేవదాస్ (37) బుధవారం ఓడీచెరువు మండలంలోని డబూరువారిపల్లి, ఎం.కొత్తపల్లి, ఓడీచెరువుకు చెందిన కూలీలతో కలసి బొలెరో వాహనంలో అన్నమయ్య జిల్లా మొలకలచెరువులోని ఓ రైతు పొలానికి బయలుదేరారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్ సమీపంలోకి చేరుకోగానే వాహనం బోల్తాపడింది. పాస్టర్ దేవదాస్, డబూరువారిపల్లికి చెందిన ఆంజనేయులు, ఎం.కొత్తపల్లికి చెందిన ఆంజనేయులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పాస్టర్ దేవదాస్ మృతి చెందారు. ఆయనకు భార్య రాజమణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ..


హాజీరా (ఫైల్)

ఓడీచెరువు: మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన హాజీరా (53) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. బుధవారం ఉదయం ఇంట్లో గృహోపకరణానికి ప్లగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు కరెంట్ ప్రసరించి షాక్‌కు గురై గట్టిగా కేక వేస్తూ కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఓడీ చెరువులోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.

వ్యక్తి బలవన్మరణం


సంజీవప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన సంజీవప్ప (40)కు భార్య ముత్యాలమ్మ, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. బుధవారం ఉదయం నొప్పి తీవ్రత తాళలేక గ్రామ సమీపంలోని మల్బరీ షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సీట్లు ఫుల్.. అడ్మిషన్లు డల్

- జిల్లాలో ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు విద్యార్థుల అనాసక్తి
- 'స్థానికతపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో దుస్థితి
- పొరుగు రాష్ట్రాల్లోని కళాశాలల్లో చేరడానికే మొగ్గు





రాప్తాడుకు చెందిన ఫణి కుమార్ కుమార్తె భావనకు ఏపీఈఏపీసెట్‌లో 17 వేల ర్యాంకు వచ్చింది. అయితే, భావన ఇంటర్ తెలంగాణలో చదవడంతో రాష్ట్ర అధికారులు 'స్థానికేతరుల' జాబితాలో చేర్చారు. దీంతో ఏపీఈఏపీసెట్‌లో మంచి ర్యాంకు దక్కినప్పటికీ రాష్ట్రంలో భావన కోరుకున్న కళాశాలలో సీటు దక్కలేదు. దీనికితోడు నాన్ లోకల్ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని తెలియడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చేరింది. ఈ అమ్మాయి ఒక్కరే కాదు.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా వేలాది మంది విద్యార్థులు పొరుగు రాష్ట్రాల్లో బీటెక్ అడ్మిషన్లు పొందడం గమనార్హం.

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 13 వేల ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో తొలి విడత ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్‌లో 9 వేల సీట్లు భర్తీ అయ్యాయి. ఇంకా నాలుగు వేల సీట్లు భర్తీ కావాల్సి ఉంది.

ఫీజులతో బాదుడే బాదుడు..

తొలి విడతలో సీట్లు దక్కిన విద్యార్థులు తక్షణమే కళాశాలలో చేరాలి. లేదంటే సీటు రద్దవుతుందంటూ యాజమాన్యాలు బెదిరింపులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి కూడా యాజమాన్యాలు డబ్బులు వసూలు చేస్తున్నాయి. బిల్డింగ్, వర్సిటీ, ల్యాబ్ అంటూ ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేలు లాగుతున్నాయి. సాధారణంగా తొలి విడత కౌన్సెలింగ్‌లో నచ్చిన కళాశాలలో లేదా మెచ్చిన కోర్సులో సీటు రాని విద్యార్థులు రెండో దఫా కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తారు. అయితే, తొలి విడత సీటు వచ్చిన కళాశాలలో ఆయా ఫీజులు చెల్లిస్తే, వేరే కళాశాలకు వెళ్లేటప్పుడు ఆ మొత్తం తిరిగి ఇవ్వబోమని యాజమాన్యాలు స్పష్టం చేస్తుండడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అనుమానం..

కూటమి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పడుతున్నాయి. ఒకటి.. అర కాదు ఏకంగా ఆరు క్వార్టర్ల చెల్లింపులు పక్కన పెట్టడంతో విద్యార్థులు విసుగెత్తి చదువులు మానేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో కొంతమంది విద్యార్థులు బీటెక్‌ను రాష్ట్రంలో చదివే బదులు కర్ణాటక, తెలంగాణలో మంచి ఇంజినీరింగ్ కళాశాలలో చేరడం మేలని భావించి.. అక్కడ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఫలితంగా ఇక్కడ ఇంజినీరింగ్ సీట్లు భర్తీ కావడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం పుణ్యమా అని ఉన్నత విద్య భ్రష్టు పట్టిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

చేరాలా.. వద్దా..?

ఇటీవల ఏపీఈఏపీసెట్ రెండో కౌన్సెలింగ్‌కు సంబంధించి విద్యార్థులు పలు కళాశాలలకు ఆప్షన్ ఇచ్చారు. ఈ నెల మూడో తేదీనే కళాశాలలు కేటాయించాల్సి ఉంది. అయితే, తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులను స్థానికేతరులుగా పరిగణించడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం తీర్పు వెలువరించేంత వరకు రెండో దఫా కౌన్సెలింగ్ జరగదు. ఈ నేపథ్యంలో దూరప్రాంతాల్లో సీటు వచ్చిన విద్యార్థులు తమకు సమీపంలో ఉండే కళాశాలలో సీటు కోసం ఎదురుచూడాలా.. లేక ఇప్పటికే సీటు దక్కిన కళాశాలలోనే బీటెక్ చదవాలా.. అనే సంశయంలో పడ్డారు.

2024 వరకు ఇబ్బంది లేదు..

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఉమ్మడి రాజధాని, ఉమ్మడి విద్యా వ్యవస్థ ఉండేది. తెలంగాణలో చదివినా, ఏపీలో చదివినా లోకల్‌గా పరిగణించేవారు. 2024 నుంచి ఈ నియమం తొలగించారు. దీంతో తెలంగాణలో చదివిన ఏపీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య ఏర్పడింది. అవగాహన లేక తమ పిల్లలను తెలంగాణలో ఇంటర్ చదివించిన తల్లిదండ్రుల బాధ నేడు వర్ణనాతీతంగా మారింది.

వాహనం ఢీకొని మహిళా కూలీ మృతి

తనకల్లు: ఆటోను తుఫాన్ వాహనం ఢీకొనడంతో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరి కొందరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో ఉన్న టమాట మండీలో పనిచేయడానికి తనకల్లు మండలం నల్లగుట్లపల్లి నుంచి పలువురు కూలీలు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో బుధవారం పలువురు కూలీలు ఆటోలో మండీకి బయలుదేరారు. చీకటిమానిపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన తుఫాన్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నల్లగుట్లపల్లికి చెందిన మహబూబ్‌జాన్, లక్ష్మమ్మ, వెంకటరమణ, ప్రమీల, రమాదేవి, ఉషారాణి, షహనాజ్, సాలెమ్మ, నజీరున్‌బీకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను తనకల్లులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పుంగనూరు లక్ష్మమ్మ, మహబూబ్‌జాన్, వెంకటరమణ, రమాదేవి, ప్రమీల, చిన్న పాపమ్మను కదిరికి తరలించారు. వీరిలో లక్ష్మమ్మ (60) పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అనంతపురానికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అక్కడ ఆమె మృతి చెందింది. ఘటనపై ఎస్ఐ గోపి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏపీఎల్‌లో రాణించిన కోగటం హనీష్

అనంతపురం: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో అనంత బ్యాటర్ కోగటం హనీష్ వీరారెడ్డి అద్భుత సెంచరీతో అజేయంగా నిలిచాడు. విశాఖ సింహాద్రి వారియర్స్ జట్టు తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న వీరారెడ్డి ఏపీఎల్ చరిత్రలోనే తొలి ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేయడం విశేషం. కేవలం 60 బంతుల్లో 104 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 8 ఫోర్లు, 9 సిక్సర్లు ఉన్నాయి.

రైతులకు రాజకీయ రంగు పులమొద్దు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


జేడీఏను నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్, చంద్రకుమార్ (చిత్రంలో) చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: రైతులకు రాజకీయ రంగు పులిమి సంక్షేమాన్ని అందకుండా చేయడం దారుణమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత–సుఖీభవ పథకం కింద ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో బుధవారం నిర్వహించిన స్థాయీ సంఘం–1, 2, 3, 4 5, 6, 7 సమావేశాలకు గిరిజమ్మ అధ్యక్షత వహించారు. తొలుత వ్యవసాయ శాఖపై చర్చ ప్రారంభం కాగానే యూరియా కొరతపై అధికారులను గిరిజమ్మ నిలదీశారు. నాసిరకం విత్తనాలు, ఎరువుల విక్రయాలపై ఎందుకు దృష్టి సారించలేకపోయారంటూ ప్రశ్నించారు. అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, చెన్నేకొత్తపల్లి, నల్లమాడ జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్, భాస్కర్, గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి సైతం వ్యవసాయ శాఖ అధికారుల తీరుపై మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. పీఎం కిసాన్ పథకం కింద ఒక్కో రైతుకు మొదటి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తే.. అదే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత–సుఖీభవ పథకం కింద ఇవ్వాల్సిన రూ.5 వేలను కొందరికి మాత్రమే జమ చేసి మిగిలిన వారికి మొండి చెయ్యి చూపిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ముద్రవేసి రైతులకు అన్యాయం చేయడం భావ్యం కాదన్నారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులకు ఉచితంగా ఇచ్చే శాంపిల్స్ వేరుశగన కిట్లు వ్యవసాయ శాఖ అధికారులే బయట అమ్ముకున్నారంటూ డి.హీరేహాళ్ జెడ్పీటీసీ సభ్యురాలు హసీనాభాను ఆరోపించారు.

తల్లికి వందనం అమలులో వంచన చేస్తారా?

విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని జెడ్పీటీసీలు వేదాంతం నాగరత్నమ్మ, భాస్కర్, చంద్రకుమార్ ఆరోపించారు. ఇప్పటి వరకూ తల్లికి వందనం అమలు వివరాలు ఇవ్వాలని అడగ్గా విద్యా శాఖ అధికారులు చేతులెత్తేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం చాలా దారుణంగా ఉంటోందని, పిల్లలకు పురుగులు పడిన, ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు వడ్డించడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశానికి ఆర్ఐఓ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను ఆయా శాఖాధిపతులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరారు. చిలమత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో తాగునీటి కొరతతో విద్యార్థులు అల్లాడిపోతున్నారని సభ దృష్టికి జెడ్పీటీసీ సభ్యురాలు అనూష తెచ్చారు. సమావేశంలో సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఉమ్మడి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు


రొద్దం నారనాగేపల్లిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉషశ్రీచరణ్

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ధ్వజం

రొద్దం: ప్రజాబలం లేకున్నా అధికారం అండతో పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ సాగించిన దౌర్జన్యం, దుర్మార్గాన్ని ప్రజలంతా చూశారని, తప్పకుండా వారికి బుద్ధి చెప్పి తీరుతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామ పంచాయతీలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు హామీలు...అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసాన్ని వివరిస్తూ 'క్యూఆర్ కోడ్'తో రూపొందించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరు తమ ఫోన్‌తో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలు తెలుస్తాయన్నారు. చంద్రబాబు అనేక తప్పుడు హామీలు ఇచ్చి గద్దెక్కిన తర్వాత ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు అంటేనే మోసం, దగ్గా, కుట్ర అన్నారు. వారు చేస్తున్న దౌర్జన్యాలకు రాబోవు రోజుల్లో చంద్రబాబు, టీడీపీ నేతలు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. పులివెందల జెడ్పీటీసీ ఉప ఎన్నిక కోసం వైఎస్సార్ సీపీ నేతలను అరెస్టులు చేసి, టీడీపీ కార్యకర్తలను పెద్ద ఎత్తున బూత్‌ల్లోకి వదిలి దౌర్జన్యం చేయడం దుర్మార్గమన్నారు. డీఐజీ, డీజీపీ, ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, కమిషనర్లు, ఎస్ఐలు, హోం మంత్రి, టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు... ఇంతమంది మకాం వేసి జెడ్పీటీసీ గెలిపించడానికి ఎన్ని దారుణాలు చేశారో ప్రజలంతా చూశారన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు, దుర్మార్గాలు చేసినా నైతికంగా వైఎస్సార్ సీపీనే గెలిచిందన్నారు. ఇప్పుడున్న మంత్రులు, ఎమ్మెల్యేలంతా ప్రజాబలంతో కాకుండా ఈవీఎంల వల్ల ఎన్నికైన వారేనన్నారు.

కలిసి కట్టుగా పనిచేదాం..

వైఎస్సార్ సీపీలో నాయకుడు, కార్యకర్త అనే బేధం లేదని... అందరం ఓ కుటుంబంగా కలిసి కట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, వార్డు సభ్యులు నాగరాజు, నాయకులు ఎన్. నారాయణరెడ్డి, అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, జట్టి శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఆవుల లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మహేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వీరేష్, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై మహాసభలో తీర్మానాలు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కదిరి టౌన్: స్థానికంగా జరిగిన 14వ సీపీఎం మహాసభలో రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై తీర్మానాలు చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నెలకొన్న స్థానికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోనేలా పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జీఎల్ నరసింహులు, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- 31 ద్విచక్ర వాహనాల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

పెనుకొండ: ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి 31 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. దుద్దేబండ క్రాస్ వద్ద సీఐ రాఘవన్ పర్యవేక్షణలో కియా ఎస్ఐ రాజేష్, సిబ్బంది బుధవారం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన పెనుకొండ మండలం మునిమడుగుకు చెందిన ఓబన్న గారి వినోద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో వాహనాల అపహరణ విషయం బయటపడిందన్నారు. దీంతో నిందితుడు తెలిపిన మేరకు హరిపురం వద్ద ఓ రేషం గ్రైనేజ్ సెంటర్‌లోని పాడుబడిన రూంలో భద్రపరిచిన 31 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వీటి విలువ రూ. 18.60 లక్షలు ఉంటుందన్నారు. కాగా, సెల్‌ఫోన్లు, డ్రిప్‌వైర్లు అపహరించిన కేసుల్లో ధర్మవరం, అనంతపురం రైల్వే పీఎస్, కొత్తచెరువు పీఎస్ పరిధిలో వినోద్‌పై కేసులు ఉన్నాయన్నారు. జల్సాలకు అలవాటు పడి అనంతపురంలో 8, కదిరిలో 6, కర్ణాటకలోని పావగడలో 5, కర్నూలు జిల్లా డోన్‌లో 3, తిరుపతిలో 3, ధర్మవరంలో 2, కళ్యాణదుర్గం, పాకాల, రొద్దం, ముదిగుబ్బలో ఒకటి చొప్పున మొత్తం 31 మోటార్ సైకిళ్లు అపహరించినట్లుగా వినోద్ అంగీకరించాడన్నారు. అపహరించిన వాహనాల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ హీరో హోండా కంపెనీకి చెందినవే కావడం గమనార్హం అన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన కియా పీఎస్ ఎస్ఐ రాజేష్, క్రైమ్ సిబ్బంది నాగరాజు, మారుతి, తదితరులను ఎస్పీ రత్న అభినందించారు.

తోటల్లో నీటి నిల్వలు తొలగించండి

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉద్యాన తోటల్లో నీరు నిల్వ అయ్యే అవకాశముందని, ఈ నిల్వలను ఎప్పటి కప్పుడు తొలగిస్తూ ఉండాలని రైతులకు ఉద్యానాధికారి చంద్రశేఖర్ సూచించారు. ముఖ్యంగా చీనీ, బొప్పాయి, అరటి, టమాట, దానిమ్మ రైతులు ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. తోటలో నీరు నిలువ లేకుండా కాలువలు తీయాలన్నారు. అరటి, టమాట, బొప్పాయిలో ఉత కర్రలు ఏర్పాటు చేయాలన్నారు. పక్వానికి వచ్చిన కాయలను కోసి ప్యాక్ హౌస్‌లలో నిల్వ చేయాలన్నారు. అధిక వర్షాలకు మచ్చ తెగులు సోకకుండా సమగ్ర సస్య రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి

- పుడా వైస్ చైర్మన్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్: పుడా పరిధిలోని అనధికారి లేఔట్లను ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) వైస్ చైర్మన్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూన్ 30కు ముందు రిజిస్ట్రేషన్ అయిన అన్ని అనధికారి లేఔట్లు, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లోపు పూర్తి అపరాధ రుసుం చెల్లిస్తే 10 శాతం రాయితీ, 46 రోజుల నుంచి 90 రోజుల లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తారు. ఓపెన్ ప్లేస్ ఉంటే 14 శాతం, లేకుంటే 7 శాతం రాయితీ ఇస్తారు. గడువు దాటితే అనధికారి లేఔట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. మరిన్ని వివరాలకు పుడా కార్యాలయంలో సంప్రదించవచ్చు.

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని పారిశ్రామిక వాడ సమీపంలో బహిరంగ ప్రదేశంలో డంప్ చేసిన 157 బస్తాల్లోని 78.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామి ఉన్నారు. బియ్యాన్ని డంప్ చేసిన వారు ఎవరనే విషయంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

వీడని బాధ్యతారాహిత్యం

ఆరోగ్య శాఖ, బోధనాస్పత్రిలో అధికారుల ఇష్టారాజ్యం

- సీజ్ చేసిన ఆస్పత్రిని తెరిచినా నిద్ర వీడని డీఎంహెచ్ఓ
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్
- ప్రొఫెసర్లు విధులకు డుమ్మా కొడుతున్నా పట్టించుకోని ఏఎంసీ ప్రిన్సిపాల్
- మంత్రి సత్యకుమార్‌కు పట్టని ప్రజారోగ్యం


అనంతపురంలోని సర్వజనాస్పత్రి

అనంతపురం మెడికల్: ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న జిల్లా వైద్య రంగంలో ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం ప్రజలకు శాపంగా మారింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, బోధనాస్పత్రిలో కీలక అధికారులే బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన పలువురు ప్రజారోగ్యం జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు పట్టడం లేదని విమర్శలు చేస్తున్నారు.

నిర్లక్ష్యం ఖరీదు ప్రాణం

జిల్లా కేంద్రంలో గతంలో సీజ్ చేసిన ప్రైవేట్ ఆస్పత్రిని అనధికారికంగా తెరిచి రోగులకు చికిత్సలు అందజేస్తున్నా.. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఓ గర్భిణి ప్రాణాలు కోల్పోతే తప్ప డీఎంహెచ్ఓ మేల్కొనకపోవడమే ఇందుకు నిదర్శనం. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్.. లావణ్య పేరుపై తన ఆస్పత్రిలో ఓ మహిళకు చేసిన శస్త్ర చికిత్స విఫలం కావడంతో ఏడాది క్రితమే కలెక్టర్ ఆదేశాలతో ఆ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ సీజ్ చేశారు. తన భార్య డెంటల్ వైద్యురాలని, ఆ ఆస్పత్రిని తెరుచుకుంటానని తరచూ ఆరోగ్యశాఖ కార్యాలయం చుట్టూ డాక్టర్ రమణ నాయక్ అప్పట్లో తిరిగారు. ఆ తర్వాత మూతపడిన లావణ్య ఆస్పత్రిని తెరిచి శ్రీకృప పేరుతో నడిపారు. ఇటీవల బీకేఎస్ మండలం చెదళ్లకు చెందిన గర్భిణి రాధమ్మ(29) ప్రాణం పోయాక మూత పడిన ఆస్పత్రిని తెరిచిన వైనం వెలుగు చూసింది. పర్యవేక్షణ మరచిన డీఎంహెచ్ఓ నిర్లక్ష్యానికి ఓ నిండు ప్రాణం బలైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం తీరూ ఇష్టారాజ్యంగా మారిందనే విమర్శలున్నాయి. గత నెలలో తాను నిర్వహిస్తున్న మేడా నర్సింగ్ హోంలో అడ్మిట్ చేసుకున్న ఉరవకొండ ప్రాంతానికి చెందిన రాజేష్ అనే 22 ఏళ్ల యువకుడిని తర్వాత జీజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందజేయించారు. అయితే ఆ యువకుడి మృతితో కుల సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. ఇటీవల జీజీహెచ్‌లో స్ట్రెచర్ అందుబాటులో లేక బెళగుప్ప తండాకు చెందిన మధునాయక్(23) మృతి చెందిన విషయం కలకలం రేపింది. తన సొంత ఆర్థో విభాగానికి సంబంధించిన వైద్యులు పట్టపగలే విధులకు డుమ్మా కొడుతున్నా డాక్టర్ ఆత్మారాం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. బర్న్స్ వార్డును అనస్తీషియా విభాగానికి కేటాయించి విమర్శలకు తావిచ్చారు. ప్రధానంగా ఆస్పత్రిలో ఓ వైద్య విద్యార్థిని దోషిగా చేస్తూ ఆస్పత్రి గ్రూపులో ఏకంగా సదరు విద్యార్థి పేరును పోస్ట్ చేయడం కలకలం రేపింది. విద్యార్థి భవిష్యత్తును ఏ మాత్రం ఆలోచించకుండా పేరును ప్రస్తావించి పరువు తీయడం ఎంత వరకు సమంజసమని వైద్య విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ప్రిన్సిపాల్ తీరూ అంతంతే

ఇటీవల అనంతపురం మెడికల్ కళాశాల (ఏఎంసీ) ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ షారోన్ సోనియా పనితీరు కూడా అంతంత మాత్రమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోధనాస్పత్రి వైద్యులు కనీసం సమయపాలన పాటించేలా కూడా ఆమె చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోజూ ఉదయం 9 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాల్సిన వైద్యులు.. అలా వచ్చి తమ వాహనాలు కూడా దిగకుండా వైద్య కళాశాల ఎదుటనే తమ మొబైల్‌లో బయోమెట్రిక్ అటెండెన్స్ వేసి వెళ్లిపోతున్నారు. అనంతరం వారికి తీరికై నప్పుడు విధులకు హాజరవుతున్నారు. ఈ పరిస్థితులను గమనించిన ప్రజలు.. జిల్లా వైద్య రంగాన్ని బాగుపరిచే వారెవ్వరూ లేరా? అంటూ ప్రశ్నిస్తున్నారు.